# ఇరువదొకటవ ప్రసంగము

ఒకప్పుడు స్వామి శ్రీ ప్రకాశానందులవారు జేతపురము చేరుకొనిరి. అంతట వారు ఆసంగతి శ్రీనిత్యానందస్వామివారికి ఉత్తరముద్వారా తెలిపిరి. ఉత్తరము ఇట్లుండెను. "నడచుశక్తి లేదు. బండిఅద్దెకు డబ్బు లేదు. కావున దయయుంచి జేతపురమున దర్శనము ఇవ్వండి." ఈవార్త తెలిసికొని శ్రీనిత్యానందులవారు జేతపురము బయలుదేరిరి. వారితో కూడ వైద్యరాజగోపాలజీభాయికూడ వచ్చిరి. వారు వెళ్ళునరికి స్వామి శ్రీప్రకాశానందులవారు జమ్కానాక్లబ్బు బైట నేలదుమ్ములో కూర్చొనిరి. ఇది చూచి గోపాలజీభాయి పలికెను :– "స్వామీ తమరు దుమ్ములో కూర్చొని ఉన్నారా?" అట్లని వచ్చిన అందరితోబాటు తాముకూడ ఆదుమ్ములోనే కూర్చొనిరి.

## మోహబుద్ధి పోయినచో దుమ్ము రాజభవనము సమానముగా తోచును.

ఈప్రసంగమున శ్రీనిత్యానందస్వామివారు ఈ దృష్టాంతము చెప్పిరి.

ఒకసమయమున ఒక నవాబు ఏనుగపై కూర్చొని వెళ్లుచుండెను. అదేమార్గమున త్రోవలో ఒకఫకీరు కూర్చొనియుండెను. అతనిని చూచి సేనాధిపతి పలికెను. "మానవాబుగారు వచ్చుచున్నారు. తమరు లేవండి."

ఫకీరు :—ఆయన ఏనుగునవాబుగారు అయితే నేను ధూళినవాబును."

సేనాధిపతి :—"స్వామీ! అదేమి అట్లు చెప్పుచున్నారు? వారికి పెద్దధనాగారము కలదు. తమవద్ద ఏమి కలదు?"

ఫకీరు :—"వారు ప్రజలను ముష్టి అడుగుకొనెదరు. అందుచే అంతధనము వారిదగ్గరకు చేరినది. నేను ముష్టి ఏమైన అడుగుకొను చున్నానా?"

సేనా :—వారికి పెద్దసేన ఉన్నది. తమకేమైన ఉన్నదా?

ఫకీరు :—వారికి శత్రుభయము కలదు. అందుచే వారు సైన్యమును పెంచిరి. నాకేమి భయము?

సేనా :—"వారికి దివాను మొదలగు పెద్దపెద్ద ఉద్యోగస్థులు కలరు."

ఫకీరు :—వారికి తెలివిలేదు. అందుచే నౌఖరులను పెట్టుకొను చున్నారు. నాకేమైన బుద్ధిలేదా?"'

ఇంతలో నవాబుగారు అచ్చటికి వచ్చిరి. ఇదేమి గొడవ అని అడిగెను.

సేనా :—"ఈ ఫకీరు త్రోవలో కూర్చొని ఉన్నాడు. చెప్పి నను లేచుట లేదు. అడ్డదిడ్డముగా సమాధానము చెప్పుచున్నాడు."

నవాబుగారు ఏనుగపైనుండి క్రిందికి దిగిరి. ఆయన కాళ్ళమీద పడి వినయముతో వారిని ఏనుగపై కూర్చుండబెట్టుకొని తీసికొని వెళ్లిరి.

స్వామివారు దుమ్ములో కూర్చొనిరి. మాయిక పదార్థముల యందు మోహబుద్ధి నివృత్తిపొందినవారికి రాజభవనము, దుమ్ము రెండును సమానమే.

## త్యాగమూర్తి మస్తరామ్ మహారాజాపూర్గు.

వైద్యరాజ :—త్యాగమూర్తియగు మస్తరామ్ మహారాజ్ గారుకూడ ఏచెట్టుక్రిందనో దుమ్ములో పడిఉండెడివారు.

స్వా. ప్ర. :— మస్తరామ్ స్వామివారితో నన్ను పోల్చ వద్దు. వారు మహాత్యాగులు.

శ్రీనిత్యానందులవారు ప్రకాశానందులవారిని అడిగిరి. తమరు అసలు మస్తరామ్‌వారిని చూచితిరా?

స్వా. ప్ర. :— విక్రమశకము 1957 లో (క్రీ॥ శ॥ 1901) నేను జామ్‌నగరు వెళ్లితిని. అప్పుడు అచ్చట ఒకద్రావిడస్వామి ఉండిరి. ఇచ్చట ఒకమహాత్ములు ఉన్నారు. వారిదర్శనముచేయ తమకు ఉద్దేశ్యము కలదా? అని వారు నన్ను ప్రశ్నించిరి. అప్పుడు వారును నేనును కలసి మస్తరామ్‌వారిని చూచుటకు వెళ్లితిమి.

## మస్తరామ్‌మహరాజ్‌గారి వినోదము.

ఆసమయమున సంభాషణలో ద్రావిడస్వామి మస్తరాముగారితో చెప్పెను. "నేను ఉన్నచోట శిథిలమయిన నూయి ఒకటి కలదు. అందు స్నానముచేయుటకు వీలుపడదు. అందుచే నేను నది దగ్గరకు చాలదూరము వెళ్ళి స్నానము చేయవలసివచ్చుచున్నది. మీకు రాజులతో పరిచయము కలదు. ఒకవెయ్యిరూపాయిలు ధర్మము చేయించినచో నూతిని జీర్ణోద్ధరణము చేయించుకొనెదను.

మస్తరాముగారు ఈసమాధానము చెప్పిరి. "నేను ధర్మకార్యముకొరకు ఇప్పించగలననుకొండి. అది బాగుచేయబడిన తరువాత ఏఅత్తయు, కోడలు అయినా పోరాడుకొని కోడలు వచ్చి నూతిలో పడినచో మీకును, నాకును పాపము.అట్టిపనులు ఏల చేయవలెను?"

స్వా. ని. :— మస్తరాముగారిమాట వినోదముతోనే నిండియుండెడిది ఒకప్పుడు ఒక భక్తుడు ఆయనవద్దకు వెళ్ళికోరెను.

స్వామీ! మేము దేవునకు ఒకమందిరము కట్టించనున్నాము. తమను తఖ్తసింగ్ మహారాజుగారితో మాకు సహాయముచేసి ఆవ్యయము భరించమని చెప్పండి."

మస్తరామ్‌గారు ప్రశ్నించెను:—"నీదేవుడు గొప్పవాడా? తఖ్తసింగ్ గొప్పవాడా? గొప్పవాడు దేవుడుకదా! గొప్పవాడు

తక్కువవానివద్దకు వెళ్ళి ముష్టెత్తుట తగునా? నీ దేవుని మందిరమున కూర్చుండబెట్టవలెనను కోరిక యున్నచో నీవు ఆయనవద్దకే వెళ్ళి అడుగుము. ఆయన ఇచ్చినడబ్బుతో మందిరము కట్టించుము."

## మస్తరామ్ మహారాజ్ నిష్కామి.

మస్తరామ్ మహారాజ్‌గారివద్ద భావనగరాధిపతి తఖ్తసింగ్ గారు ఒక పవిత్రదివసమున నాలుగైదువేలరొఖ్ఖము ఉంచెను. అది చూచి స్వామివారు అడిగిరి. "ఈరూపాయిలు ఎందుకు ఉంచిరి?"

మహా:— "తమకొరకు కాదు. తమకు యోగ్యులని తోచిన బీదవారికి ఇది పంచిపెట్టండి."

"మీదగ్గరనుంచి ధనము తీసికొని నేను ఇతరులకు పంచిపెట్టవలెనా? నేను మీనౌకరునా?"అని మస్తరాముగారు అనిరి.

స్వా. వి. :—వాడు చెప్పినది నిజమే. ఇతరులవద్దనుంచి డబ్బుతీసికొని పంచిపెట్టుట సన్యాసికి నిషిద్ధము.

## సన్యాసికిగాని బ్రాహ్మణునకుగాని ప్రతిగ్రహము నిషిద్ధము.

*ప్రతిగ్రహం న గృహ్ణీయాత్ నైవ చాన్యం ప్రదాపయేత్,*
*ప్రేరయేద్వా తథా భిక్షః స్వప్నేఽపి న కదాచన॥*
(నారదపరివ్రాజకోపనిషత్)

"భిక్షువునకు ప్రతిగ్రహము కూడదు. తాను ఇతరులకు ఏమియును ఇప్పించరాదు. అటులనే స్వప్నమునందుకూడ ఇతరుని ఇవ్వమని ప్రేరేపించరాదు."

స్వా. వి. :—మనువు బ్రాహ్మణునకు అధ్యయనము, అధ్యాపనము, యజనము, యాజనము, దానము, ప్రతిగ్రహము అను ఆరు కర్మలు చేయుటకు అధికారము ఇచ్చిరి. అయినా, తాము ప్రతిగ్రహమును నిషేధించుట సమంజసమే. ఏలనన—

ప్రతిగ్రహసమర్థోఽపి ప్రసజ్గం తత్ర వర్జయేత్,
ప్రతిగ్రహేణ హ్యాస్యాశు బ్రాహ్మం తేజః ప్రశామ్యతి॥

"ప్రతిగ్రహమునకు సామర్థ్యము ఉన్నను ఆప్రసంగమును విసర్జించవలెను. ఏలనన, బ్రాహ్మణుని బ్రహ్మతేజము ప్రతిగ్రహముచే నశించును." ఈదృష్టాంతముచే ఆసంగతి బోధపడును.

వాయుపురాణమునందలి రేవాఖండమున ఈకథ యున్నది. ధూమ్రసేనుడను ఒకరాజు కలడు. ఆతడు సూర్యగ్రహణము సమీపించినంతనే ఒక బంగారు రథమును తయారుచేయించెను. అశ్వములను స్వర్ణభూషణములతో అలంకరించి నర్మదాతీరమునందలి కపిలాసంగమమునకు వచ్చి ముద్గలుడను ఉంఛవృత్తిశీలుడైన ఋషిని ఇట్లు ప్రార్థించెను—

"ఈభూషణములతో కూడిన రథమును స్వీకరించుడు." కాని ముద్గలఋషి స్వీకరించుటకు ఇష్టపడలేదు. అంతట రాజు తన నౌకరులను పిలచి చుట్టుప్రక్కలనున్న గ్రామములలో ప్రతిగ్రహము చేయుటకు సామర్థ్యముకల బ్రాహ్మణుని తీసికొనిరమ్మని పంపెను. నౌకరులు ఎంతశ్రమపడినను ఎవరును రాలేదు. రాజు ఎంతయో ఖేదముతో పలికెను.

"ఏమి, ఈప్రదేశమున ఈదానము స్వీకరించి నన్ను తరింపజేయు బ్రాహ్మణులు లేనేలేరా?"

ఈమాటలు విని గాలవఋషి పలికెను. "నీయందలి అనుగ్రహముచే నేను ఈసంసారసాగరమునుండి నిన్ను ఉద్ధరించెదను."

ఆ కపిలాసంగమమున ఉన్న బ్రాహ్మణు లెల్లరును ఆతనిని ఆప్రతిగ్రహమును చేయవలదని చెప్పిరి. అయినను గాలవఋషి దానిని ప్రతిగ్రహించెను.తోడనే అతని తేజము,తపము, కీర్తి సర్వము నశించెను. ఆతని శరీరము నల్లబడెను. వెంటనే ఆతడు చనిపోయెను.

కొలదికాల మయిన తరువాత ఆతడు రాజుగారిగుర్రముగా జన్మించి ఎంతయో శ్రమపడెను.

ఒకప్పుడు ధూమ్రసేనుడు ఆగుర్రముపై కూర్చొని వేటకు వెళ్ళెను ఒక అడవిపందిని వెంటాడు సమయమున ఆగుర్రము నదిలో దిగబడి మునిగిపోయెను. గుర్రమునుండి దివ్యస్వరూపముతో గాలవ ఋషి బయటకు వచ్చెను. ఆతడు పలికెను:—

రాజా! నీవద్ద ప్రతిగ్రహము చేసినందున నీగుర్రముగా జన్మించి నీకు వాహనముగా నుంటిని. వాహనరూపమున నేను ఎంతయో కష్టమును పొందితిని. నీవుకూడ నన్ను ఎంతయో బాధించితివి.

*దావాగ్నినా తు యద్దగ్ధం పునరేవ ప్రరోహతి।*
*ప్రతిగ్రహేణ యో దగ్ధః న నారోహతి కర్హిచిత్॥*

"అరణ్యము దావాగ్నిచే దగ్ధమయినను మరల పెరుగును కాని ప్రతిగ్రహముచే దగ్ధమయినను నరుడు తిరిగి ఔన్నత్యమునుపొందడు."

ఇట్లు చెప్పి తేజఃస్వరూపముతో అంతర్ధాన మయ్యెను.

మనువు మొదలగువారు స్మృతులయందు ప్రతిపాదించినను ప్రతిగ్రహమును నిషేధించుటకుకూడ కారణము కలదు. ప్రతిగ్రహము బ్రహ్మవిద్యకు విఘ్నమును కలుగజేయును. అందుచే శాస్త్రజ్ఞులు ఆపద్ధర్మముగా దానిని అంగీకరించిరి.

*అధ్యాపనం యాజనం చ విశుద్ధాచ్చ ప్రతిగ్రహః।*
*విప్రస్య జీవికా ప్రోక్తా తత్రాన్త్యాత్వాపది స్మృతా॥*

"అధ్యాపనము, యాజనము, పరిశుద్ధహృదయుని వద్దనుండి ప్రతిగ్రహమును విప్రుని జీవనోపాయములని చెప్పబడినవి. వానిలో చివరిది ఆపద్ధర్మము."

వైద్య :—ఇచ్చటికి వచ్చు సన్యాసులలో కొందరు విద్వాంసులుకూడ ఉందురు. అయినను వారు ద్రవ్యమును కోరెదరు.

## విద్వాంసులగు సన్న్యాసుల విపరీత-ఆచరణము.

స్వా. ప్ర. :— ఇతరులు కొంచెము తప్పుచేసినను అంత పాపు కాదు. కాని విద్వాంసులే శాస్త్రమర్యాదను ఉల్లంఘించినచో వారికి కలుగు అధఃపతనము శివపురాణమున చెప్పబడినది.

సాక్షరా విపరీతాశ్చ రాక్షసాస్తు ఇతి స్మృతాః।
తస్మాద్వై విపరీతం చ కర్మ నైవాచరేద్యతిః॥

సాక్షరులు విపరీతముగా సంచరించిన రాక్షసులు అని చెప్ప బడుదురు. ('సాక్షరా' అనుపదమును విపరీతముగా నుచ్చరించినచో 'రాక్షసా' అగును.) కావున యతులు విపరీతాచరణము చేయుట కూడదు.

ఈరోజులలో ఈ నడవడిక అనేకచోట్ల కన్పించుచున్నది. విద్వాంసులు విపరీతముగా సంచరించుటచే చాల హీనస్థితికి దిగజారి పోవుదురు. వారు మొదట యతిధర్మమును విడనాడి రాగబుద్ధిచే ద్రవ్యమును సంపాదించి శాస్త్రవిరుద్ధంగా మఠములను కట్టించెదరు. వాటిని నిర్వహించుటకు అనేక కపటోపాయములద్వారా జాగీర్లు మొదలగునవి చేస్తుదురు.

జాగీర్లు సంపాదించినతరువాత వాటిని నిర్వహించుటకు శిష్యుల సంఖ్య పెంచవలసివచ్చును. తమపనులకు అడ్డువచ్చినవారియందు ద్వేషము పెంచుకొనెదరు. వారిని కోర్టులకు ఎక్కించెదరు. ఇంకను అనేకవిధములుగా బాధించెదరు. ఇంతటితో సంతోషించక కొందరు హత్యలుకూడ చేయించెదరు. ఈ చర్యల పరిణామముగా వారి శిష్యులు వారు ఎప్పుడు పదమువదించెదరా అని ఎదురుచూచెదరు. విషాదులచే గురువులను చంపించుటకూడ కలదు. ఇట్లు దైవస్వభావ మును త్యజించి రాగముచే అసురులయి, అసురస్వభావమునుండి ద్వేషముచే రాక్షసులగుదురు.

## ఆచార్యులకు ధనము నిషిద్ధము.

వైద్య :—సామాన్యులగు సన్యాసులు ధనమును తీసికొన రాదు. అది బాగుగనే ఉన్నది. ఆచార్యులకు ధనము నిషిద్ధము కాదు కదా!

స్వా. ప్రి. :—ఆచినోతి చ శాస్త్రార్థమాచారే స్థాపయత్యపి।
స్వయమాచరతే యస్మాదాచార్యస్తేన చోచ్యతే॥

"శాస్త్రార్థమును శాస్త్రాధ్యయనముద్వారా తెలిసికొని తదనుసారముగా సంచరించువాడునై ఇతరులచేతను ఆచరింపజేయువాడు ఆచార్యుడని చెప్పబడును."

యతి ధనమును స్వీకరించరాదని ధర్మశాస్త్రము చెప్పుచునే యున్నది. కనుక యతి ఆచార్యుడయినతరువాతకూడ ధనమును గ్రహించనే కూడదు. ఏలనన, శాస్త్రవిరుద్ధముగా తాను సంచరించరాదు. ఇతరులను సంచరించనీయరాదు. ఆశ్రమమునకు తగిన పనులనే తాను చేయవలెను. ఇతరులచేతను కూడ చేయించవలెను

## శంకరాచార్య భగవత్పాదుల ఆచరణము సన్యాసులకు గౌరవము నిచ్చునది.

వైద్యగోపా :—ఆదిశంకరులుకూడా కానుకలు, పూజ మొదలగునవి స్వీకరించెడివారేమో కదా!

స్వా. ప్రి. :—ఒకమారు శంకరభగవత్పాదులు ఎల్లెడలను వేదధర్మమును స్థాపించి కేరళదేశమునకు విచ్చేసిరి. అంతవరకు అచ్చటిరాజు వారి దివ్యమగు కీర్తిని వినియుండిరి. "ఆచార్యుల శరీరము మనదేశమునందలిది. ఇది దేశముయొక్క మహాభాగ్యము. ఏలనన, వారి నిష్కల్మషమగు కీర్తి భూమండలమున వ్యాపించినది." ఈభావముతో వారి పవిత్రదర్శనము చేయుటకై వెళ్ళి ఆయనను తన భవనములోనికి కొనిపోయెను. ఆయనను సింహాసనముపై కూర్చుండబెట్టి

పాదప్రక్షాళనాదులు చేసి, ఆరతి ఇచ్చి, నైవేద్యాదికములు ఉంచి, ఒకవేయి బంగారునాణెములతో నింపిన పళ్ళెము వారిచరణముల చెంత నుంచెను.

ఆస్వర్ణశకలములతో నిండిన పళ్ళెమును చూచి ఆచార్యులు కేరళాధీశునితో పలికిరి. "ఓ రాజా! మీరు విద్వాంసులు. ధర్మమును ఎరుగుదురు. యతుల ధర్మము మీకు తెలియనిదికాదు. ఈ కానుకలను పుచ్చుకొని అధర్మమున ప్రవర్తించుటచే నేను పతితుడనగుదును."

ఇట్లు యతిధర్మమును ఉపదేశించి ద్రవ్యమును స్వీకరించకుండ వెళ్ళిపోయిరి. శంకరభగవత్పాదులు అంతసమర్థులయినను సన్యాసధర్మమునకు విపరీతముగా సంచరించలేదు.

వైద్య:— ఆరోజులలో ఆదిశంకరాచార్యులు ఏనుగులు, గుర్రములు, కూడా జనులను, సమస్తమును కలిగి యుండెడివారుకదా! అది ద్రవ్యము లేనిదే ఎట్లు జరుగును?

స్వా. ప్ర. :— ఆది శంకరులకు ఏనుగులు, గుర్రములు ఉన్నవని వారిచరిత్రములయందు లేదు. సత్పురుషు లెవరును ఆవిషయమును స్థిరపరచలేదు. ఆయన భిక్షాటనముచేసి భుజించెడివారనియు, చెట్టుక్రింద పరుండెడివారనియు దక్షిణమున నేటికిని అందరు చెప్పుదురు.

వైద్య:— శంకరులు నాలుగు మఠములను నిర్మించిరికదా!

స్వా. ప్ర. :— మఠములను ఆయన కట్టించలేదు. నాలుగు దిక్కులయందును ధర్మమును రక్షించుటకు నలుగురు శిష్యులను ఉంచెను. అందుచే భగవత్స్వరూపులైన ఆచార్యులు ఆశ్రమవిరుద్ధమగు కృత్యములను వేనిని చేయలేదని చెప్పవచ్చును.

వైద్య :— ఆచార్యులు ఏనుగులు, గుర్రములు, ఛత్రచామరాదులు కలిగిఉన్నచో ప్రజలు ముగ్ధులగుదురు కాదా!

## సత్పురుషుల సాత్త్వికసంపదకును, రాజుల రాజససంపదకును మధ్యకల భేదము.

సత్పురుషుల మహిమ వారియోగబలముచేతనే కానవగును. ఏలనన, సత్పురుషులు సత్త్వగుణప్రధానులయి ఉందురు. రాజులు ఏనుగులు, గుర్రములు మొదలగువానిని తమ ఐశ్వర్యమును శోభింప జేయుటకు ఉంచెదరు. కాని ఎవరును సద్భావముతో అంతఃకరణ పూర్వకముగా ఆదరించరు. రాజులు తమ రాజ్యమునందలి దివాను, నౌకరులు, ప్రజలు మొదలగువారిపై అధికారము చలాయించెదరు. కాని వారందరును ధర్మమును యథార్థముగా పాలించు సత్పురుషుని ఆజ్ఞలను పాలించునట్లు రాజుగారి ఆజ్ఞలను పాలించరు. రాజుగారి ఆజ్ఞలను ప్రజలు వారిహయాము ఉన్నంతకాలమే పాటించెదరు. కాని ధర్మగురువుల ఆజ్ఞానుసారము ఆచంద్రతారార్కము సంచరించెదరు.

రాజులు తమ రాజ్యమునంతను నిర్వహించుటకు అనేకమంది నౌకరులను పెట్టుకొనెదరు. కాని సజ్జనులకు ఒకపైస అయిన ఖర్చు చేయు నవసరములేదు.

సజ్జనులు వెళ్ళిన ప్రతిచోటయును వేలకొలది, లక్షలకొలది జనులు వారి ఆజ్ఞలను పాలించెదరు. వారిసేవ చేయుటకు సంసిద్ధులగుదురు. జగత్పరమగు సంపద సత్పురుషుల సంపదయే.

పూర్వము వశిష్ఠ, వామదేవ, భృగు, ఆంగీరసాది సజ్జనుల చరణధూళిచే సార్వభౌముల కిరీటములు పవిత్రమయ్యెను. రాజుల ఔన్నత్యము వారి అధికారకాలమునందుమాత్రమే, అదియును వారి రాజ్యములయందుమాత్రమే ఉండును. సాత్త్వికపరిపాలనము చేయు సజ్జనుల ఆజ్ఞలు వారితరువాత వేలకొలది సంవత్సరములవరకును పాలించబడును. నేడుకూడ వేదధర్మప్రతిపాదకులగు వ్యాసవశిష్ఠాదుల ఆజ్ఞలను మన్నించుటకు లక్షలు, కోట్లు జనులు సంసిద్ధులయి

ఉన్నారు. వేలకొలది సంవత్సరములకు పూర్వము జన్మించిన సజ్జనుల ఆజ్ఞలను నేటికిని శ్రద్ధాభక్తిసమన్వితముగ గౌరవించుచున్నారు. అటులనే మహాత్ములగు బుద్ధుడు, క్రీస్తు, జరథుస్త్ర మొదలగువారి పేరుపై లక్షలకొలది, కోట్లకొలది జనులు ప్రాణములను అర్పించుటకు సిద్ధముగా నున్నారు. ఈజగత్తుయొక్క నిజమగు సామ్రాజ్యము సత్పురుషులదియే. ఈసామ్రాజ్యమును రక్షించుటకు ఒక్కసిపాయికూడ అక్కరలేదు.

దైవసంపదకల జిజ్ఞాసువుల దృష్టిలోనే జగత్తునందలి ఏనుగులు, గుర్రములు, రథములు, పాలకీలు మొదలిగునవి మాయికసంపదగా లెక్కించబడును. అవి పిల్లలు ఆడుకొను ఆటబొమ్మలవంటివి. ఇక శ్రోత్రియులును, బ్రహ్మనిష్ఠులును, పూజ్యచరణులును భగవత్స్వరూపులును అగు ఆచార్యులసంగతి చెప్పవలసిన పని ఏమి?

## అతిపరిచయమువలన అగౌరవము.

ఇట్లు స్వామివారితో సంభాషణ జరుగుచుండెను. ఆసంభాషణలో వైద్యరాజు అడిగెను. "జ్ఞానమునకు సాధనము ఏమి?"

శ్రీప్రకాశానందస్వామివారు సమాధానము చెప్పిరి. మీరు స్వామివారివద్ద ఎప్పుడును ఉందురు. నన్ను ఎందుకు అడుగుచున్నారు?

వైద్యరాజ :—స్వామివారును, తమరును ఒకటే అని తలచుచున్నాను.

స్వా. ప్ర. :—ఇద్దరును ఒకటి అనుకొనినచో స్వామివారినే అడగండి.

స్వా. ని. :—నిత్యము సమీపమున ఉండువారియందు శ్రద్ధ ఉండదు. అందుచే తమరే చెప్పండి.

వైద్య :—స్వామివారును, తమరును ఒకటే అని తలచుచున్నాను

స్వా. ప్రి. :—సన్నికర్షోపి మర్త్యానాం అనాదరణకారణమ్।
గాఙ్గం హిత్వా యథాన్యామ్భః తత్రత్యో యాతి శుద్ధయే॥

"ఎల్లప్పుడును కలిసియుండుట కేవలము అనాదరమునకు కారణము. పవిత్రమగు గంగాజలమును విడచి గంగాసమీపమున ఉండు మనుష్యులు పారిశుద్ధ్యమునకు నూతులవద్దకును వెళ్ళెదరు". అటులనే సత్పురుషులవద్ద ఎల్లప్పుడును ఉండువారు సత్పురుషులను గౌరవించలేరు.

జ్ఞానమును పొందు శ్రద్ధావంతుడగు జిజ్ఞాసువు.

శ్రద్ధ ఉన్నచో ఒకనివద్దనుండియే జ్ఞానము లభించును. శ్రద్ధ లేకపోయినచో ఎంతమంది సాధువులచెంతకును, సన్యాసుల చెంతకును వెల్లినను జ్ఞానము లభించదు. మనుష్యులు వారివద్దకు వెళ్ళినను, వారు జవాబులు చెప్పినను ఆచరణమునందు వానిని చూపించవలెనను సరియగు కోరిక కలుగదు.

స్వా. ని. :—వైద్యరాజు అట్టివారు కాగు. తేనెటీగ అన్ని పూవులనుండియు రసమును గ్రహించి తేనెను తయారుచేయునట్లుగనే జిజ్ఞాసువుకూడ వేరువేరు ప్రదేశములయందు అడిగి జ్ఞానమును సమీకరించును. కావున తాము వైద్యరాజుకు సమాధానము చెప్పవలసియున్నది.

స్వా. ప్రి. :— నేనేమి చెప్పను? భగవానుడే గీతయందు చెప్పెను.

సత్త్వాత్సంజాయతే జ్ఞానం రజసో లోభ ఏవ చ।
ప్రమాదమోహౌ తమసో భవతోఽజ్ఞానమేవ చ॥

"సత్త్వగుణముచే జ్ఞానము కలుగును. రజోగుణముచే లోభము కలుగును. తమోగుణముచే ప్రమాద, మోహములు కలుగును. అజ్ఞానముకూడ దానిచేతనే కలుగును." ఇట్లు జ్ఞానోత్పత్తికి ముఖ్యసాధనముకూడ సత్త్వగుణమే.

## జ్ఞానభేదములు.

శాస్త్రమునందు స్మృతి, అనుభవము అను భేదములచే జ్ఞానము రెండురకములు. సంస్కారమాత్రజన్యమగు జ్ఞానము స్మృతి జ్ఞానమని చెప్పబడును. స్మృతిజ్ఞానము యథార్థ, అయథార్థ భేదములచే రెండురకములు. యథార్థ అనుభవజన్యమగు సంస్కారముచే కలిగినజ్ఞానము యథార్థస్మృతిజ్ఞానము అనెదరు. అయథార్థ అనుభవజన్యమగు సంస్కారముచే కలిగిన జ్ఞానము అయథార్థస్మృతిజ్ఞానము అనబడును.

అనుభవజ్ఞానముకూడ యథార్థ, అయథార్థభేదములచే రెండురకములు. యథార్థజ్ఞానము ప్రత్యక్ష, అనుమితి, ఉపమితి, శాబ్ద, అర్థాపత్తి, అనుపలబ్ధి భేదములచే ఆరురకములు. వాని ప్రమాణములుకూడ ప్రత్యక్ష, అనుమాన, ఉపమాన, శబ్ద, అర్థాపత్తి, అనుపలబ్ధి భేదములచే ఆరురకములు. ఈ విధమగు ఆరు ప్రమాణములద్వారాను ఉత్పన్నమయిన జ్ఞానము యథార్థజ్ఞానము లేక ప్రమాణము అనబడును. ప్రత్యక్షజ్ఞానమునకు నేత్రములు, త్వక్, జిహ్వ, ఘ్రాణము, శ్రోత్రములు అను అయిదును కారణములు. ఈ అయిదుకారణములచేతను ఉత్పన్నమయిన జ్ఞానము ప్రత్యక్షజ్ఞానము. అద్వైతసిద్ధాంతమున దానిని వృత్తిజ్ఞానము అనెదరు. అయథార్థజ్ఞానము సంశయము, విపర్యయము, తర్కము అని మూడురకములు. ప్రత్యభిజ్ఞ అను మరియొక జ్ఞానము కలదు. అది ప్రమాత్మకము. ఇట్లు ఆరువిధములగు ప్రమ, రెండురకములగు స్మృతి, మూడురకములగు అయథార్థజ్ఞానము కలసి జ్ఞానము 11 రకములు. అందులో యథార్థజ్ఞానము సత్త్వముచే జనించును.

వేదాంతశాస్త్రమున జ్ఞానము రెండురకములుగా చెప్పబడినది. 1. వృత్తిజ్ఞానము 2. స్వరూపజ్ఞానము. వృత్తిజ్ఞానము ఇంద్రియముల

ద్వారాను, అంతఃకరణముద్వారాను జన్మించును. అది అనిత్యము. స్వరూపజ్ఞానము ఆత్మజ్ఞాన మనబడును. అది నిత్యము.

ఆత్మజ్ఞానమునకు అనగా స్వరూపజ్ఞానమునకు అసాధారణ కారణము "తత్త్వమస్యా"ది మహావాక్యవిచారము. సాధారణకారణములు నిష్కామకర్మాదులు. అంతఃకరణమున మల, విక్షేప, ఆవరణములు అను మూడుదోషములు ఉండును. నిష్కామకర్మచే మలదోషము పోవును. భగవదుపాసనచే విక్షేపదోషము నివృత్తిని చెందును. జ్ఞానముచే ఆవరణదోషము పోవును.

వివేకము, వైరాగ్యము, శమాదిషట్కము, ముముక్షుత్వము–ఈనాలుగు సాధనములతోను కూడిన మనుష్యుడు వేదాంతశ్రవణమునకు అధికారి. శ్రవణము ప్రమాణమునందలి అసంభావనను పోగొట్టి వేదవాక్యముల తాత్పర్యము బ్రహ్మమునందు నిశ్చయించుటకు తోడ్పడును. మననము ప్రమేయమునందలి అసంభావనను పోగొట్టును. నిధిధ్యాసనము జీవబ్రహ్మముల భేదమును కలుగజేయు విపరీతజ్ఞానమును నివృత్తినొందించి జీవబ్రహ్మముల అభేదమును గమనింపజేయును. ఈదోషత్రయరహితుడగు ముముక్షువు "తత్త్వమస్యా"ది మహావాక్యములద్వారా స్వరూపసాక్షాత్కారమును పొందగలడు. ఆత్మ జ్ఞానరూపము. ఈ జ్ఞానరూపమగు ఆత్మ నిత్యము, శుద్ధము, బుద్ధము, ముక్తము, ఆనందైకరసము, చిన్మూర్తి.

## రజోగుణముచే అనర్థకరమగు లోభము పుట్టును.

రజోగుణముచే లోభము అను అనర్థకరమగు దోషము పుట్టును. దాని స్వరూపమును గ్రంథకర్తలు అనేకవిధములుగా వర్ణించిరి. పదార్థము యథాయోగ్యముగా లభించియుండ అవివేకముద్వారా వేరు వేరు పదార్థములయందు అంతఃకరణము పొందు వృత్తివిశేషము లోభము. ఈలోభి పదార్థసంపాదనమునందు అవివేకముచే

పుణ్యపాపములను పరీక్షించడు. అంతియేకాదు. సంపాదించిన పదార్థములను లోకకళ్యాణముకొరకు కాని, ఆత్మరక్షార్థముకాని వినియోగించడు. అప్రాప్తపదార్థములను మాటిమాటికి కోరుచుండును. ఈ లోభము సకల అనర్థములకును ఆదికారణము.

*లోభాత్ క్రోధః ప్రభవతి క్రోధాద్ద్రోహః ప్రవర్తతే।*
*ద్రోహేణ నరకం యాతి శాస్త్రజ్ఞోఽపి విచక్షణః॥*

"లోభముచే క్రోధము పుట్టును. క్రోధముచే ద్రోహము పుట్టును. ద్రోహముచే నరకము కలుగును. శాస్త్రపండితు డయినను భూతద్రోహముచే నరకమును పొందును.

## ప్రమాదము మృత్యువు వంటిది.

తమోగుణముచే ప్రమాదము (పొరబాటు), మోహము, అజ్ఞానము ఉత్పన్నమగును. బ్రహ్మప్రాప్తికొరకు మనుష్యులకు ఆజ్ఞాపించబడిన శ్రుతి స్మృత్యాదుల వచనములను శ్రవణముచేసినను వానిని మరచి అన్యథాసంచరించుట ప్రమాదము. ఈపొరబాటు ఏ విధముగను మంచిదికాదు. శ్రుతి ఏమి చెప్పుచున్నదో చూడుడు.

*ప్రమాదో బ్రహ్మవిద్యాయాం న కర్తవ్యః కదాచన।*
*ప్రమాదో మృత్యురిత్యాహుః విద్యాయాం బ్రహ్మవాదినః॥*

"బ్రహ్మవిద్యాభ్యాసమునందు ఎప్పుడును పొరబాటు తగదు. బ్రహ్మవిద్యను సంపాదించుటయందలి పొరబాటు మృత్యువు అని బ్రహ్మజ్ఞులగు సత్పురుషులు చెప్పుదురు."

తన హితాహితములు తెలిసికొను బుద్ధిసామర్థ్యము లేకుండుట మోహము. మోహగ్రస్తుడగు నరుడు తనహిత మేదియో, అహిత మేదియో నిశ్చయించలేడు. మోక్షసాధనములగునవి హితములు. ప్రతిబంధకములగు మాయాకార్యములు అహితములు. హితాహితముల గ్రాహ్యత్వత్యాజ్యత్వావివేకము మోహము.

విషయము లన్నియును మాయాకార్యములు. అవి దుఃఖమును గలిగించును. కావున అహితములు. వానియందు వివేకరాహిత్యముతో ప్రియత్నపూర్వకముగ పురుషార్థముచేయుట మోహము.

మోహము మద్యపానమువంటిది.

భర్తృహరి సంచారసమయమున జగమునందలి జనులు సత్యపదార్థమును విడనాడి మాయయందే మునిగియుండెడివారు. వారిని చూచి చెప్పెను:—

*ఆదిత్యస్య గతాగతై రహరహః సంక్షీయతే జీవితం*
*వ్యాపారై ర్బహుకార్యభారగురుభిః కాలో న విజ్ఞాయతే ।*
*దృష్ట్వా జన్మజరావిపత్తిమరణం త్రాసశ్చ నోత్పద్యతే*
*పీత్వా మోహమయీం ప్రమాదమదిరామున్మత్తభూతం జగత్ ॥*

"సూర్యుని గమనాగమనములతోబాటు జీవితము క్షీణించును. వివిధములగు కార్యముల భారముచే సమయము తెలియదు. జన్మము, వార్ధక్యము, ఆపదలు, మృత్యువు— వీనిని చూచుటచే ఏమాత్రము బాధ కలుగదు. ఏలనన జగము మోహముతో కూడిన పొరబాటను మద్యమును పానముచేసినది. అందుచే తనను తాను మరచిపోయినది."

ఒకగ్రామమునందలి మాలపల్లెలో ఉత్సవము జరిగెను. వారు వంటకు నిప్పు వెలిగించిరి. జనులు భోజనముచేసి విశ్రమించుసమయమునకు అగ్నిహోత్రము మండిపోయి ఆరిపోయియుండెను. అందు బూడిదమాత్రమే ఉండెను. సాయంకాలసమయమునకు అచ్చటికి భర్తృహరి వచ్చెను. చలికాలపు రాత్రి. కప్పుకొనుటకు వెచ్చని వస్తువు ఏమియు లేదు. కావున ఆయన వెచ్చని బూడిదను పరచుకొని అచ్చటనే పరుండెను.

ప్రక్కనే ఒకడు కల్లుత్రాగి ఒడలు తెలియక పడియుండెను. అర్ధరాత్రిసమయమున ఆతని మత్తు తీరెను. కావున ఆతడు సమీపమున ఉన్న తన ఇంటికి వెళ్లి తలుపుతట్టెను.

భార్య పలికెను:— నీవు రోజును ఆలస్యముగా వచ్చుచున్నావు. కల్లు త్రాగుదువు. సంపాదన లేదు. ఈరోజు తలుపుతీయను. భర్తృహరిమహారాజు లేనిదే ఆయన రాణీలకు కాలము గడచినచో నాకు ఏల గడువదు? ఇట్లు తిరస్కార వాక్యములను వినినను ఆతడు రాత్రియంతయు భార్యను తలుపుతీయుమని బ్రతిమాలుచునే ఉండెను. చివరవరకు ఆమె తలుపు తీయలేదు. ఇది వినిన భర్తృహరి ఆలోచించెను. "ఓ మోహమా! నీవు ఎంత హీనమైనదానవు. స్త్రీ అంత స్థిరముగానున్నను ఆపురుషునిచే అంత బ్రతిమాలించుచున్నావు."

పాషాణఖణ్డేష్వపి రత్నబుద్ధిః కాన్తేతి ధీః శోణితమాంసపిణ్డే ।
పఞ్చాత్మకే వర్ష్మణి చాత్మభావో జయత్యసౌ కాచన మోహలీలా॥

"పాషాణమునందు రత్నమను భావమును కలిగించును. రక్తమాంసముల సమూహమునందు మనోహరమగు రమణి అను భావమును కలిగించును. పంచభూతాత్మకమగు శరీరము ఆత్మ అనిపించును. అనిర్వచనీయమగు ఈ మోహము తన లీలచే జగమునంతను జయించుచున్నది."

## అజ్ఞానము సర్వదుఃఖములకును కారణము.

అజ్ఞానము అనగా ప్రకాశరహితత్వము. తాను ప్రకాశరహితుడయి తన ఆశ్రయమును అప్రకాశితముగా చేయుట అజ్ఞానము. ఇంటియందలి అంధకారము తాను ప్రకాశరహితముగానుండి ఇంటియందలి పదార్థములను అన్నిటిని అప్రకాశితములుగా చేయును. అట్టిది అజ్ఞానము. కొన్నిచోట్ల అజ్ఞానము తాను అప్రకాశితముగానుండి స్వాశ్రయమునందు అన్యపరిణామములు తెచ్చును. రజ్జూపహితమగు చేతనమునందుండు అజ్ఞానము రజ్జూపహితమగు చేతనమును ఆచ్ఛాదించి సర్పరూపమగు పరిణామమును కలిగించును. అటులనే స్వస్వరూపవిషయకమగు అజ్ఞానము సాక్ష్యాశ్రితమయి, సాక్షిని ఆవరించి ప్రపంచ

రూపమగు జగత్తుగా పరిణమింపజేయును. ఈఅజ్ఞానము "అహం అజ్ఞోఽస్మి" "నేను అజ్ఞానిని" "అహం న జానామి" నాకు తెలియదు" అను ప్రతీతిచే ప్రతీయమాన మగును. ఈ అజ్ఞానము వాస్తవమునకు తుచ్ఛమైనది. దీని వాస్తవికమగు అస్తిత్వము లేదు. అనగా అధిష్ఠానజ్ఞానము కలిగినతరువాత దాని అస్తిత్వము ఉండదు. అయినను స్వాధిష్ఠాన సాక్షాత్కారమునకు పూర్వము ఈ అజ్ఞానము దుఃఖములన్నిటికిని కారణము. కావున సత్పురుషులను శరణుజొచ్చి సద్బోధద్వారా ఈ అజ్ఞానమును పోగొట్టుకొనవలెను.

*ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్య వరాన్ నిబోధత ।*
*క్షురస్య ధారా నిశితా దురత్యయా*
*దుర్గం పథస్తత్ కవయో వదన్తి ॥* (కఠోపనిషత్తు)

"అజ్ఞానమను నిద్రలో కునికిపాట్లుపడు ఓమానవులారా! మీరు లెండు. మేల్కొనుడు. శ్రేష్ఠుడగు సద్గురుని పొంది ఆత్మను తెలిసికొనుడు. ఖడ్గముయొక్క తీక్ష్ణమగు పదునువలె జ్ఞానము అత్యంతకఠినమయినది. కావుననే జ్ఞానులు జ్ఞానమార్గము అత్యంత దుర్గమ మయినదని చెప్పుదురు."

## మాయ సర్వభక్షిణి.

నలుడు భార్యయగు దమయంతిని అరణ్యమునందు ఒంటరిగా విడచి వెళ్లిపోయెను. అంత దమయంతి బిడారిజనుల గుంపుతో తన పుట్టింటివైపు వెళ్ళుచుండెను. ఒకరాత్రి ఒకవృక్షముక్రింద వారందరు డేరావేసి నిద్రించిరి. దమయంతిమాత్రము భర్తృవియోగదుఃఖముతో కుమిలిపోవుచు మేల్కొని యుండెను. అంతలో ఒక అడవి ఏనుగు మదోన్మత్తమై వచ్చిపడెను. ఇది గాంచి దమయంతి గుంపులోని జనులను మేల్కొలిపెను. "ఓసోదరులారా! లెండు, లెండు!" ఆమె ఎంతయో గోల చేసెను. అయినను ఎవ్వరును మేల్కొనలేదు. అంతట అందరను ఏనుగ త్రొక్కివేసి వెళ్ళిపోయెను.

అదేవిధముగా శ్రుతి బిగ్గరగా అరచి అరచి చెప్పుచున్నను మనవారు లేవరు. మాయ అందరను భక్షించివేయును.

వైద్య:— మేల్కొనుట అనగా నేమి?

స్వా. ప్ర. :— శ్రుతియందు "ఉత్తిష్ఠత, జాగ్రత" అను రెండు పదములు కలవు. "ఉత్తిష్ఠత" అనగా లెమ్ము, బ్రహ్మమునకు అభిముఖుడవు అగుము. "జాగ్రత" అనగా మేల్కొనుము. అనగా "ఆవరణమును భేదించుము." జగమున నాలుగురకముల మనుష్యులు ఉన్నారు. 1. పామరులు 2. విషయపరాయణులు 3. జిజ్ఞాసువులు 4. జ్ఞానులు.

1. పామరులు నాస్తికులు అగుటచే శ్రుతిఆజ్ఞలను నమ్మరు. వారు రజస్తమోగుణప్రధానులగుటచే ఇహలోకమునందలి విషయ సుఖమే సత్యమని తలచెదరు.

2. విషయలోలురు రజోగుణప్రధానులు. వీరు పరలోక సుఖము శ్రేయస్కరమనుకొనెదరు.

3. జిజ్ఞాసువులు మిశ్రసత్త్వగుణప్రధానులు. వీరు ఈలోకమునందును, పరలోకమునందును లభించు సుఖములను త్యజించి మోక్షసుఖమును కోరెదరు.

4. జ్ఞానులు ఆవరణభంగము కావించి మోక్షసుఖమును పొందియుందురు. పైశ్రుతి ఈనాలుగు రకములలోను ఉన్న పామరులను గురించికాని, జ్ఞానులను గురించిగాని ఆజ్ఞాపించుటలేదు. జిజ్ఞాసులను ఉద్దేశించి ఆజ్ఞాపించుచున్నది.

వైద్య:— ఆవరణభంగమునకు సాధనమేమి?

స్వా. ప్ర. :— ఆసాధనమును శ్రుతి స్పష్టముగనే చెప్పుచున్నది.

*శ్రోతవ్యో, మన్తవ్యో నిదిధ్యాసితవ్యః ।*

"ఆత్మ శ్రవణము చేయదగినది. మననము చేయదగినది. నిది ధ్యాసనము చేయదగినది." ఉపక్రమాది షడంగముల ద్వారా వేద శబ్దముల తాత్పర్యము అద్వితీయుడగు బ్రహ్మమునందే అను నిశ్చయమును పొంది వానిని తెలిసికొనుట శ్రవణము అనబడును. ఏప్రకరణమునందైనను వస్తుప్రతిపాదనమునకు ఉపయోగపడునవి ఉపక్రమోపసంహారములు. ఏవస్తువు ప్రతిపాదించబడుచున్నదో దానిని పలుమారు తెలుపుట అభ్యాసము అనబడును. ఛాందోగ్యము ఆరవ అధ్యాయమున "తత్త్వమసి" అను అద్వితీయబ్రహ్మము తొమ్మిది మారులు ప్రతిపాదించబడినది. ఏప్రకరణమునందు ఏవస్తువు ఏప్రమాణముచే ప్రతిపాదించబడినదో ఆప్రమాణముకంటె (అనగా ప్రతిపాదించు శబ్దప్రమాణముకంటె) అతిరిక్తమగు ప్రమాణాభావమును తెలుపుట అపూర్వత్వము. ఎట్లన ఛాందోగ్యము ఆరవప్రపాఠకమున ఉపనిషత్ప్రమాణముచేమాత్రము అద్వయబ్రహ్మము ప్రతిపాదించబడినది. బ్రహ్మమును గ్రహించుటకు మరియొక ప్రమాణము అసమర్థమయినది అని తెలుపబడినది.

ఏప్రకరణమున ఏవస్తువుయొక్క ఆత్మజ్ఞానముకాని, తదనుష్ఠానముకాని ప్రతిపాదించబడినదో, ఆప్రకరణమున ఆప్రతిపాదితమగు వస్తువుయొక్క ప్రయోజనము ఏదైన చెప్పబడిన అది దాని ఫలము అని చెప్పబడును.

ఛాందోగ్యము ఆరవ అధ్యాయము చూడుడు.

"ఆచార్యవాన్ పురుషో వేద తస్య తావదేవ చిరం యావన్న విమోక్ష్యే అథ సంపత్స్యే"

ఆచార్యుని ఉపాసించువాడు బ్రహ్మమును తెలిసికొనుటకు తలయుసామర్థ్యమును పొందును.అజ్ఞాని విముక్తికలుగువరకు నిరీక్షించుచుండును. అనగా ప్రారబ్ధము క్షయమును పొందువరకు నిరీక్షించు

చుండును. ప్రారబ్ధక్షయమును పొందినంతనే బ్రహ్మమునందు లీన మగును. ఇట్లు అద్వితీయబ్రహ్మజ్ఞానముచే బ్రహ్మప్రాప్తి అను పరమ ప్రయోజనము కలదు.

ఏవస్తువు ప్రతిపాదించబడినదో దానిని ప్రశంసించుచు చెప్పు పదములు అర్థవాదములు అనబడును.

**ఉదా:—** ఉద్దాలకుడు శ్వేతకేతునితో చెప్పెను.

"*ఉత తమాదేశమప్రాక్ష్యో యేనాశ్రుతం శ్రుతం భవత్యమతం మతమవిజ్ఞాతం విజ్ఞాతం భవతి.*"

"ఓకుమారా! దేనిని శ్రవణముచేయుటచే శ్రవణవిషయము కానిది కూడ శ్రవణవిషయ మగునో, మనన విషయము కానిది కూడ, మననవిషయము అగునో, బుద్ధివిషయము కానిది కూడ బుద్ధివిషయము అగునో, అనగా తెలియనగునో ఆ ఆత్మతత్త్వమును తెలిసికొనుటకు నీవు గురువుచెంత జిజ్ఞాసను వ్యక్తపరచితివా?" అని అద్వితీయబ్రహ్మ మును ప్రశంసించెను.

ఏప్రకరణమున ఏవస్తువును ప్రతిపాదించవలెనో, ఆప్రకరణ మున ఆవస్తువునే ప్రతిపాదించుటకు చెప్పిన యుక్తి ఉపపత్తి అన బడును.

"*యథా సోమ్యైకేన మృత్పిణ్డేన సర్వం మృణ్మయం విజ్ఞాతం స్యాత్ వాచారమ్భణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్॥*"

'ఛాందోగ్య. 6. అ.

ఓసౌమ్యుడా! మృత్పిండజ్ఞానము కలుగుటతోడనే, మృణ్మయపాత్రల జ్ఞానము కలుగును. మట్టితో చేయబడిన కుండ మొదలగు వికారము లును, నామములును, రూపమును, సంజ్ఞను బోధించుటకు మాత్రమే. నిజమునకు మట్టి ఒక్కటియే''అని తోచును. అటులనే సాంసారిక పదార్థము లన్నియును అద్వితీయవస్తుప్రతిపాదకములగు యుక్తు

లనియే తెలియనగును. నిజమునకు అద్వితీయబ్రహ్మముతప్ప వేరొక వస్తువు లేదు.

ఇట్లు ఆరు లింగములచేతను ఉపనిషదాదులద్వారా బ్రహ్మమునకు సంబంధించిన సర్వప్రమాణములును, సంశయములును అంతరించువరకును చేయు అభ్యాసము శ్రవణము. ఈశ్రవణము గురూపదిష్టమగు శాస్త్రముద్వారానే జరుగును.

## మననము.

శ్రవణముచేసిన అద్వితీయబ్రహ్మము అను అర్థమును శ్రుత్యనుకూలములగు అనుమానాది యుక్తులద్వారా చింతించుట మననము. ఆవు మేతమేసిన తరువాత ఏచెట్టునీడనైన కూర్చుని నెమరువేసి తృప్తిని పొందును. అటులనే వేదాంతశాస్త్రమును శ్రవణముచేసిన తరువాత ఏకాంతమున కూర్చొని దానిని మననముచేయుటచే దృఢముగా బోధపడును.

## పంచదశియందలి మనన లక్షణము.

*యుక్త్యా సంభావితత్వానుసంధానం మననం తు తత్,*

"యుక్తులద్వారా గురువువద్ద శ్రవణముచేసిన అభిప్రాయము సంభవము అను నిశ్చయమును పొందుట మననము."

శ్వేతకేతునకు అతని తండ్రి "తత్త్వమసి" అని తొమ్మిది మారులు ఉపదేశించెను. "జీవుడు బ్రహ్మము" అను ఉపదేశము ఎన్నిమారులు శ్రుతి చెప్పినను "జీవుడు బ్రహ్మము" అనుజ్ఞానము మననాభావమున వ్యవహారపరుడును అనధికారియునగు జీవునకు కలుగదు. కావున జీవ బ్రహ్మైక్యజ్ఞానమును సంపాదించుటకు సారభూతమగు "తత్త్వమసి" యందలి 'తత్, త్వమ్' శబ్దముల శబ్దార్థమునందు భాగత్యాగలక్షణద్వారా జీవబ్రహ్మాభేదమును నిశ్చయించవలెను.

"తత్" శబ్దమునకు వాచ్యార్థము ఈశ్వరుడు, సర్వజ్ఞత్వాది ధర్మవిశిష్టుడు.

"త్వమ్" శబ్దమునకు వాచ్యార్థము జీవుడు, అల్పజ్ఞత్వాది ధర్మవిశిష్టుడు.

సర్వజ్ఞత్వ, అల్పజ్ఞత్వములు రెండును విరుద్ధధర్మములు. కాని ఉపనిషదాదులను అభ్యసించినవారికి ఆధర్మములు ఉపాధిమాత్రము లేననియు, ఉపహితజీవచైతన్యమును, ఈశ్వరచైతన్యమును ఒకే చిదేకరసమగు బ్రహ్మము అని తెలియును. ఇట్లు 'జీవుడు బ్రహ్మము' అను నిశ్చయమునకు సాధకుడు వచ్చును. అంతే కాదు. ఒకే ఆకాశము ఘటము, పటము అను వేరు వేరు ఉపాధులను పొందుటచే ఘటాకాశ పటాకాశాది రూపమున స్థూలముగా ప్రతీతమగును.

అటులనే ఒకే బ్రహ్మము అను చైతన్యము అవిద్య లేక మాయయొక్క వేరు వేరు ఉపాధులద్వారా జీవరూపమున అల్పజ్ఞుడుగాను, ఈశ్వరరూపమున సర్వజ్ఞుడుగాను ప్రతీతుడగును. ఈయుక్తులు నేను "శుద్ధస్వరూపుడను" అను అభేదనిశ్చయమును చేయుటకు ఉపకరించును. అభేదనిశ్చయమునకు ఇట్టి యుక్తులను ఉపయోగించుట మననము.

ఈ కారణముచే ఏయుక్తులద్వారా భేదజ్ఞానము పెరుగునో అవి కుతర్కము అనిపించుకొనును. మననము అనిపించుకొనదు.

బ్రహ్మవిద్యను సంపాదించవలెనను కోరిక కలవానియందు వినయము, మాహాత్మ్యజ్ఞానము, శ్రద్ధ, బ్రహ్మచర్యాదులును ఉండవలెను. ఆగుణములు లేకపోయినచో బ్రహ్మవిద్యను సంపాదించుటకు ప్రయత్నించినవారు కుతర్కమునకు లోనగుదురు. మననమునందు యుక్తులను ఉపయోగించవలెను. కాని విరోచనుడు ఉపయోగించినట్టివి మాత్రము కారాదు.

## నిదిధ్యాసనము.

విజాతీయవృత్తులను తిరస్కరించుటతోబాటు సజాతీయవృత్తులను ప్రవహింపజేయుట నిదిధ్యాసనము.

"నేను సత్తును, చిత్తును, ఆనందమును, కూటస్థుడను, అక్రియుడను, అజరుడను, అమరుడను, పూర్ణుడను, నిత్యుడను, శుద్ధుడను, బుద్ధుడను, ముక్తస్వరూపుడను నగు ఆత్మను." -ఇట్టి జ్ఞానరూపమగు ప్రవాహము సజాతీయవృత్తిప్రవాహము.

"నేను బ్రాహ్మణాది నాలుగువర్ణములకును చెందినవాడను కాను. బ్రహ్మచర్యాది నాలుగు ఆశ్రమములును నేను కాదు. పురుష, స్త్రీ, బాలాది భేదములు నావి కావు" -ఇట్టి జ్ఞానరూపమగు వృత్తులప్రవాహము విజాతీయప్రత్యయ తిరస్కారము. నిదిధ్యాసనము జ్ఞానమునకు సాక్షాత్కారణము. అది పరిపాకమును పొందనిదే అవిద్యాక్షయము జరుగదు.

*"నిదిధ్యాసనశూన్యస్య నాస్త్యవిద్యాపరిక్షయః।*

నిదిధ్యాసనరహితుడయినవానికి అవిద్య నశించదు. ఈరోజులలో శ్రవణ, మననములు చేయుట కలదు. గురువువద్ద శాస్త్రశ్రవణము చేయుదురు. మననముతో ఎల్లప్పుడును శాస్త్రావలోకనము చేసి కంఠస్థముకూడ చేయుదురు. కాని ఏకాంతమున కూర్చొని ఎవడును నిదిధ్యాసనము చేయుట లేదు. నిదిధ్యాసనము చేయనంతవరకు బ్రహ్మసాక్షాత్కారము కలుగదు.

*శ్రుతేః శతగుణం విద్యాన్మననం మననాదపి।*
*నిదిధ్యాసం లక్షగుణం అనన్తం నిర్వికల్పకమ్॥*

(వివేకచూడామణి)

"వేదాంతశ్రవణముకంటె బ్రహ్మముయొక్క మననము నూరురెట్లు గొప్పది. మననముకంటెను బ్రహ్మముయొక్క దృఢధ్యానము లక్ష

రెట్లు ఫలముకలది. నిర్వికల్పసమాధి అంతకంటె అనంతమగు ఫలమును ఇచ్చును." నిర్వికల్పసమాధిద్వారా జ్ఞానము కలుగును. జ్ఞానముచే అన్నిరకములగు దుఃఖములును నివృత్తినిచెందును. కావుననే శ్రుతిచెప్పుచున్నది.

"ఆత్మా వారే ద్రష్టవ్యః"

ఓ మైత్రేయీ, ఆత్మ దర్శించదగినది.

వైద్య:— చాలరోజులనుండి నేను వాక్సంయమము కొంచెముగా ఉంచుకొనుచున్నాను. చిత్తమును అంతర్ముఖముగా చేసికొనుటకు ప్రయత్నించుచున్నాను. అయినను ఇంతవరకును చిత్తము అంతర్ముఖము అగుట లేదు.

స్వా. ప్రి. :— చాలమంచిది. ఇప్పుడు చిత్తము అంతర్ముఖము కాకపోయినను భయము లేదు. నీవు మార్గమున ఉన్నావు. నీ అభ్యాసానుక్రమము శ్రుతిని అనుసరించి ఉన్నది. ఆవిధముగా సతతము అభ్యసించినచో చిత్తము అంతర్ముఖము అగును.

*యచ్ఛేద్వాఙ్మనసి ప్రాజ్ఞస్తద్యచ్ఛేత్ జ్ఞానమాత్మని ।*
*జ్ఞానమాత్మని మహతి నియచ్ఛేత్తద్యచ్ఛేచ్ఛాన్త ఆత్మని ॥*

"వివేకియగు నరుడు వాణిని మనస్సునందు లయము చేయవలెను. ఆమనస్సును ప్రకాశరూపమగు బుద్ధియందు లయము చేయవలెను. బుద్ధిని మహత్స్వరూపమగు ఆత్మయందు లయము చేయవలెను. దానిని శాంతమగు ఆత్మయందు లయము చేయవలెను."

లౌకికములును, వైదికములును అగు శబ్దములను ఉచ్చరించుటకు హేతువులగు వాగాది ఇంద్రియములను అధికారియగు పురుషుడు మనస్సునందు లయము చేయవలెను. వాగాది ఇంద్రియముల వ్యాపారములను అన్నిటిని త్యజించి మనోవ్యాపారమునందు మాత్రమే తాను స్థితిని పొందవలెను. వాక్కును జయించినతరువాత సంకల్పవికల్పా

త్మకమగు మనస్సును విజ్ఞానమునందు- బుద్ధియందు లయము చేయవలెను. "నేను మనుష్యుడను, "నేను బ్రాహ్మణుడను" అను విశేషాహంకారమునకు పేరు జ్ఞానాత్మ." అధికారి ఈజ్ఞానాత్మరూపమున స్థితిని పొందవలెను. అనంతరము విశేషాహంకారమును మహత్స్వరూపమున లయము చేయవలెను. అనగా నేను మనుష్యరూపమున ఉన్నాను, బ్రాహ్మణరూపమున ఉన్నాను అనువిధమున అహంకారమును త్యజించి అస్మితారూపమున శేషించి ఉండవలెను.

అహంకారముయొక్క సూక్ష్మావస్థయే "అస్మిత". ఈఅస్మితయే మహత్తత్త్వము. ఇదియే సూక్ష్మాహంకారము అని కూడ చెప్పబడును.

అస్మితారూపమగు మహదాత్మను ఏకరసచైతన్యరూపమగు శాంతఆత్మయందు లయము చేయవలెను. అస్మితనుమాత్రము త్యజించి కేవలచైతన్యరూపముతోమాత్రమే ఉండవలెను.

ఈప్రకారము చైతన్యమగు ఆత్మయందు చిత్తమును అన్నివిధముల లయముచేయుట నిరోధసమాధి.

1. వాక్‌నిరోధము, 2. నిర్మనస్కత్వము, 3. అహంకారరాహిత్యము, 4. మహత్తత్త్వరాహిత్యము అనునవి నాలుగు దశలు.

ఇచ్చట అహంకార రాహిత్యము అనగా విశేషాహంకారరాహిత్యము, మహత్తత్త్వరాహిత్యము అనగా సామాన్య అహంకారరాహిత్యము అని తెలిసికొనవలెను.

1. గోవులు, అశ్వములు మొదలగు జంతువులయందు మానవునికి ఉన్నట్లు వాగింద్రియము లేదు. అటులనే వాగింద్రియము ఉన్నను దాని వ్యాపారములు స్వాభావికముగా అభావమును పొందుట వాక్‌నిరోధము అను మొదటి దశ.

2. పుట్టుకనుండియు మూగయును, చెముడును కల బాలురయందు మనోవ్యాపారములు స్వాభావికముగా అభావమును పొందును. అటులనే వాక్, శ్రోత్రాదులు, మనస్సు ఉండినను మానవుని

మనోవ్యాపారములు స్వాభావికముగా అభావమును పొందుట నిర్మనస్కత్వము అను రెండవదశ.

3. తంద్రావస్థయందు అనగా నిద్రారంభమునందు అహంకారము ఉండును. కాని విశేషాహంకారము ఉండదు. ఏలనన ఆస్థితియందు "నేను ఉన్నాను" అను ప్రతీతి కలుగును. కాని నేను ఫలానావాని కుమారుడను, ఫలానాజాతికి చెందినవాడను— ఇటువంటి విశేషప్రతీతి కలుగదు. తంద్రావస్థయందు ఉన్నంతవరకు సామాన్య అహంకారమే యుండును. అటులనే తంద్రావస్థను పొందకపోయినను విశేషాహంకారమును పొందకపోయినచో అహంకారరాహిత్యము అను మూడవ దశ అని తెలిసికొనవలెను.

4. సుషుప్తియందు సామాన్యాహంకారము ఉండదు. ఏలనన ఆసమయమున "నేను" అను ప్రతీతికూడ కలుగదు. అటులనే సుషుప్తి లేకపోయినను కలుగు సామాన్యాహంకారనివృత్తి మహత్తత్వరాహిత్యమను నాలుగవ దశ.

వైద్య:— నేను పూర్వము కొంచెము ఎక్కువగానే అభ్యాసము చేసెడివాడను. అంతలో యువకుడైన నాకుమారుడు చనిపోవుటచే పుత్రశోకముచే అభ్యాసమునకు అంతరాయము కలిగినది. నేను పుత్రశోక మను లోతగు నూతిలో పడిపోతిని. ఇప్పుడు ఇంకా కొంచెము నయమే.

స్వా. ప్ర. :— తల్లి, తండ్రి, భార్య, పుత్రులు మొదలగు వారి వియోగము జగమున నీఒక్కడికే కాదు. అనేకులకు కలిగినది. యోగవాశిష్ఠమునందు ఈవిషయమున ఒక ఆఖ్యానము కలదు.

## పుణ్యపావనుల వృత్తాంతము.

జంబూద్వీపమున మహేంద్రపర్వతముపై నున్న ఒక ప్రవాహతీరమున దీర్ఘతముడను ముని తనభార్యతోకూడ నివసించుచుండెను. అతనికి ఇరువురు బిడ్డలు. పెద్దవాడు జ్ఞాని. వాని పేరు

పుణ్యుడు. చిన్నవాడు కొంతవరకు అజ్ఞాని. వాని పేరు పావనుడు. ముని వార్ధక్యమున దేహత్యాగముచేసెను. భార్యకూడ తనయోగ శక్తిచే శరీరమును త్యజించి స్వామిని కలిసెను.

పావనుడు తల్లిదండ్రుల వియోగముచే మిక్కిలి దుఃఖించ సాగెను. పుణ్యుడు ఆతని వద్దకు వచ్చి ఓదార్చెను. "అబ్బాయీ, పావనుడా! ఎందుకు ఏడ్చుచున్నావు? నీతల్లిదండ్రులు ఆత్మపదమును పొందిరి. స్వస్వరూపమును పొందిరి. వారికి ఉత్తమోత్తమమగు పదవి లభించినది. నీవు దుఃఖించుటకు ఇందు కారణము ఏమి కలదు? శోకించరాని దానికొరకు నీవు ఏల శోకించుచున్నావు? నీవు ఎవర కును కుమారుడవు కావు. ఎవరును నీకు తల్లిదండ్రులు కారు. నీకు ఇంతవరకు ఎందరో తల్లిదండ్రులు అయిపోయిరి. నీవు ఎందరకో కుమారుడవు అయితివి. ఋతువు ననుసరించి వృక్షములకు కాయలు కాచి పండ్లు పండి రాలిపోవునట్లు జననమరణములు జరుగుచుండును. నీవు ఈజన్మమందలి నీతల్లిదండ్రులకొరకు శోకించుచున్నావు. కాని గడచిన జన్మలయందు అసంఖ్యాకులగు తల్లిదండ్రులు అయిపోయిరి కదా! వారికొరకు ఏల దుఃఖించుటలేదు? ఓ మహాభాగుడా! నీకు దృశ్య మానమగు ఈప్రపంచము జాగృతమయిన భ్రమ. పరమార్థదృష్టిని చూచిన జగత్తు లేదు. మిత్రులు ఎవరును లేరు. శత్రువులు ఎవరును లేరు. ఎండమావులు ఏవియో పెద్దనదివలె కన్పించును. వాని యందు ఒక నీటిబిందువయినను ఉండదు. అటులనే జగత్తు అను వస్తువు ఏది యును లేదు. పరమార్థదృష్టిని విచారించినచో ఈకన్పించునదంతయు భ్రాంతి యనియు, మాయాదృష్టిచే మాటిమాటికి ఉత్పన్నమగుచు, నశించుచు ఉండును అనియు నీకు తెలియును. ఈజగము అంతయు నీసంకల్పముచే జన్మించినది. ఇందు సత్పదార్థము ఏమియును లేదు. నీకు స్ఫురించిన భావములే భాసించును. ప్రపంచమును గురించి ఎట్టి కల్పనలు చేయుదువో అట్లే అది నీకు కన్పట్టును. పత్నీభావము కలి

గినచోట పత్ని భాసించును. పుత్రభావము కలిగిన చోటపుత్రుడు భాసించును. బంధుభావముతో బంధువు, మాతాపితరుల భావనచే మాతాపితరులు కన్పట్టును. ఇట్లు ఇదంతయును భావనాధీనమగు ప్రపంచము అగుటచే బంధువులు ఎవరును లేరు. శత్రువులు ఎవరును లేరు. సర్వకాలములయందును ఒకే సర్వాత్మ ఉన్నది. యోగదృష్టితో చూచినచో పూర్వము అనేకపర్యాయములు నీవు పశు, పక్షి, జలచరాది అనేక యోనులయందు జన్మించితివనియు, ఆసమయమున నీకు ఎందరో బంధుమిత్రాదులు ఉండిరనియు తోచును. ఇప్పుడు నీవు వారి అందరును గురించియు విచారించుట లేదు. ఏలనన ఇప్పుడు నీకు చాలకాలమగుటచే వారి జ్ఞాపకము లేదు. ఓసోదరా, నీవాసనను అనుసరించి నీవు జన్మించితివి. నేనుకూడ ఇటులనే అనేకజన్మలను పొందితిని. అజ్ఞానులే దేహేంద్రియాదుల గుణములతో తాదాత్మ్యమును పొందుదురు. సుఖదుఃఖములను అనుభవించెదరు. జ్ఞాని దేహేంద్రియముల కర్మలను చేయుచున్నను కర్త కాడు. దర్పణమునందు ప్రతిబింబము పడినను దర్పణము సంతోషమును కాని, దుఃఖమును కాని పొందనట్లుగనే జ్ఞానికి రాగద్వేషములు కలుగవు. తనస్వరూపమునందు నిమగ్నుడయి ఉండును. అటులనే నీవు మిథ్యయగు దేహభావమును త్యజించి నిత్య, శుద్ధ, శాంత, పరమానంద స్వరూపమునందు స్థితిని పొందుము. నీవు పరబ్రహ్మస్వరూపము అయి ఉన్నావు.''

ఇట్లు పుణ్యుడు బోధించినతరువాత పావనునకు తనస్వరూపజ్ఞానము కలిగెను. తల్లిదండ్రుల వియోగముచే కలిగిన శోకము నివృత్తిని పొందెను. ఈవిధముగా ఇరువురు సోదరులును ఎల్లప్పుడును ఆనందముతో నుండి ప్రారబ్ధకర్మము క్షీణించినతరువాత నూనెలేని దీపము నిర్వాణము పొందునట్లు విదేహముక్తిని పొందిరి.

స్వా. ని. :— స్వామివారు చెప్పినసంగతి నిజము. దేహము నందు అధ్యాస ఉన్నంతవరకు— అనగా "నేనే శరీరమును" అనుం భ్రాంతి ఉన్నంతవరకు దారాపుత్రాదులయందు మమత్వబుద్ధి యుడును. అందుచే అనేకరకములగు దుఃఖములు అనుభవించవలసి వచ్చును.

ఈవిషయమున పద్మపురాణమున ఒకకథ కలదు.

పూర్వము తుంగభద్రానదీతీరమున ఆత్మదేవుడు అను బ్రాహ్మణుడు కలడు. ఆతనికి ధుంధులి అను పేరుగల పేచీకోరు భార్య ఉండెను. ఆయనకు సంతానము లేనందున దానధర్మాదులయందు తన కున్న ధనములో అర్ధభాగము ఖర్చుపెట్టెను. అయినను పుత్రుడు కాని, పుత్రిక కాని కలుగలేదు. అపుడు ఆత్మదేవుడు విరక్తి కలిగి ఇంటినివిడచి వనమునకుపోయెను. మధ్యాహ్నకాలమున దాహమువేసి నందున ఒక చెరువువద్దకు వెళ్ళెను. ఆతడు జలమును త్రావి చెట్టునీడను రెండుఘడియలు కూర్చొనెను. అంతలో ఒకసన్యాసి ఆమార్గమున వచ్చెను. ఆత్మదేవుడు ఆతనిని కాంచి పాదములంటి నమస్కరించెను. ఎంతయో దుఃఖములో నిట్టూర్పువిడచుచు నిలబడి యుండెను. అట్లు బ్రాహ్మణుడు ఏడ్చుట చూచి సన్యాసి ఆతని దుఃఖమునకు కారణము అడిగెను. అంతట ఆత్మదేవుడు తన సంతానహీనత్వమునకు చెందిన కథనంతయు వివరించెను. ఇది వినినంతనే సన్యాసికి మిక్కిలి దయ కలిగెను. తన యోగబలముచే ఆతడు బ్రాహ్మణుని లలాటమున వ్రాయబడిన లిపిని చదివెను. అందు "నీకు ఏడుజన్మములవరకును సంతానము లేదు" అను సంగతి ఉండెను. అది చదివి సన్యాసి బ్రాహ్మణునితో నిట్లు చెప్పెను. "ఇప్పుడు నీవు పుత్రేచ్ఛను త్యజించుము. అందు సుఖము లేదు. సగరుడు, అంగరాజు మొదలగు రాజులు సంతానముచే దుఃఖమును పొందిరి. కావున నీవు పుత్రే

చ్ఛను విడనాడుము.'' ఇట్లు బ్రాహ్మణునకు ఎంత తెలియజెప్పినను ఆతడు శాంతించలేదు. మాటిమాటికి సంతతిని ప్రసాదించుడని సన్యాసిని కోరెను. "వరము నీయనిచో తమ చరణములయందు ప్రాణత్యాగము చేసెదనని'' చెప్పెను. బ్రాహ్మణుని ఈపట్టుదల చూచి సన్యాసి ఒకఫలము నిచ్చి చెప్పెను. "ఈఫలము నీభార్య తిని ఫలాన వ్రతములను ఆచరించినచో సంతానము కలుగును.''

బ్రాహ్మణుడు సన్యాసికి నమస్కరించి, ఫలమును తీసికొని, సంతోషముతో ఇంటికివచ్చి, వృత్తాంతము నంతయు భార్యకు చెప్పి, ఫలమునిచ్చి ఇది తినుమనిచెప్పెను. భార్య బ్రాహ్మణునిఎదుట అటులనే అని సమాధానము చెప్పెను. కాని తరువాత గర్భధారణముచే కలుగు ప్రసవపీడను గురించి ఆలోచించి ఎన్నియో కుతర్కములను చేసి,తన ఆవునకు దానిని తినిపించెను.తనకు సీమంతము చేసికొని తనసోదరికుమారుని రహస్యముగా తీసికొనివచ్చి తనకు కుమారుడు పుట్టెనని నటించెను. తనకు కుమారుడు పుట్టుటచే ఆత్మదేవుడు ఎంతయో సంతోషించి ఆకుమారునిపేరు ధుంధుకారి అని పెట్టెను. తరువాత ఫలమును తినిన ఆవునకు పుత్రుడు కలిగెను. అందరును ఆశ్చర్యపడిరి. ఆకుమారుని కర్ణములు ఆవుచెవులవలె పొడవుగా నుండుటచే గోకర్ణుడని ఆతనికి పేరుపెట్టిరి. ఎంతయో దుఃఖముతో క్రుంగిపోవు ఆత్మదేవుడు తనకు పుట్టిన ఇరువురు కుమారులను చూచుకొని మురిసిపోయెడివాడు. రోజులు గడచినవి. ఇద్దరును యువకులయిరి. గోకర్ణుడు మహాపండితుడును జ్ఞానియును అయ్యెను. ధుంధుకారి మహాకపటియు, మహాఖలుడును అయ్యెను. అందుచే ఆతడు తనతండ్రి ఆస్తినంతను చెడ్డవారిస్నేహముతో నశింపజేసెను.తండ్రియగు ఆత్మదేవుడు దరిద్రుడయి, ఎన్నియో కష్టములకు లోనయి చాలదుఃఖించెను. ఆతడు ఆత్మహత్యచేసికొనుటకు తలపడెను. ఆసమయమున గోకర్ణుడు

తండ్రితో పలికెను. తండ్రీ! ఈప్రపంచము పూర్తిగా సారహీనమైనది. దుఃఖరూపము. మిక్కిలి మోహమును ఉద్భవింపజేయును. కుమారు డెవడు? ధనమెవరిది? ఈప్రపంచముపై స్నేహమును కలిగియుండెడి వాడే ఎప్పుడును దహించుకొని పోవుచుండును. చక్రవర్తికికాని, ఇంద్రునకుకాని ఏమియు సుఖమనునది లేదు. సుఖము విరక్తిని పొంది ఏకాంతమున జీవించు మునికి మాత్రమే కలుగును. నీవు అజ్ఞానమును త్యజించుము. ఈశరీరము నశ్వరము. కావున సర్వస్వమును త్యజించి వనమునకు పొమ్ము. అంతేకాదు ఓతండ్రీ!

దేహేఽస్థిమాంసరుధిరేఽభిమతిం త్యజ త్వం
జాయాసుతాదిషు సదా మమతాం విముఞ్చ।
పశ్యానిశం జగదిదం క్షణభఙ్గనిష్ఠం
వైరాగ్యరాగరసికో భవ భక్తినిష్ఠః॥

"ఈ ఎముకలు, మాంసము, రుధిరము కల శరీరమునందు నీవు అహంబుద్ధిని త్యజించుము. స్త్రీపుత్రాదులందు మమత్వమును ఎల్లప్పుడును విడనాడుము. ఈజగత్తు క్షణభంగురమేనని ఎల్లప్పుడును నమ్ముము. వైరాగ్యమునందు రసమును గ్రహించి భక్తియందు నిష్ఠ కలిగియుండుము."

ధర్మం భజస్వ సతతం త్యజ లోకధర్మాన్
సేవస్వ సాధుపురుషాన్ జహి కామతృష్ణామ్।
అన్యస్య దోషగుణచిన్తనమాశు ముక్త్వా
సేవాకథారసమహో నితరాం పిబ త్వమ్॥

"నీవు నిరంతరమును ధర్మమును సేవించుము. లోకాచారమును త్యజించుము. సత్పురుషులను సేవించుము. కామతృష్ణను విడనాడుము. పరుల గుణదోషములను విచారించుటకు పూనుకొనకుము.

త్వరగా భగవానుని సేవారసమును, కథారసమును పూర్తిగా పానము చేయుము.''

ఈవిధముగా జ్ఞాని అగు తనకుమారుడు చెప్పినమాటలు విని ఆత్మదేవుడు స్థిరబుద్ధిని పొంది గృహత్యాగము చేసెను. ఆతడు వనమును ప్రవేశించి మిగిలిన ఆయుర్దాయమును భగవచ్చింతనమునందు గడపి మోక్షపదమును పొందెను.

ఈప్రసంగము జరుగుచుండగనే ప్రేమజీభాయి అచటకు వచ్చెను. ఆయన ఏజన్సీలో ఉద్యోగముచేసి పింఛను తీసికొనుచుండిరి. వారు అచ్చటికి వచ్చి స్వామి నిత్యానందులవారికి నమస్కరించి పలికెను. ''నేను ఈమధ్యనే ఉద్యోగము చేయుచున్నాను. అందుచే పనియుండి ముందు రాలేకపోతిని. క్షమించుడు. స్వాములను ఇరువురను చూచు అదృష్టము కలిగినది. ఇది మహాభాగ్యము.''

స్వా. ని. :—మీరు మేనేజరు ఉద్యోగము చేయుచున్నారని విన్నాను.

ప్రేమ:—ఏమి చేయను! బహుకుటుంబీకుడను. అందుచే ఉద్యోగము చేయవలసి వచ్చుచున్నది.

స్వా. ప్ర. :—(దీర్ఘపరిచయ ముండుటచే వినోదమునకు) అనగా జీతము కొరకు మాత్రమే ఉద్యోగము చేయుట లేదన్నమాట. నౌకరులు, వాహనములు మొదలగు అధికారమును ప్రకటించు సాధనములకొరకు ఉద్యోగము చేయుచున్నారు. పరమాత్ముడు విముక్తిని ఇచ్చి జీవితము గడపికొను సాధనమును ఇచ్చినను మరల బానిసత్వమునకు తయారయిరి. ఈవిషయమున దక్షిణదేశమునందలి దృష్టాంతమును ఒకదానిని వినుడు.

ఒకరాజ్యమునందు ఒకదివాను కలడు. రాజునకు ఒకరోజు రాత్రి రెండుగంటలకు ఆతని సలహా అవసరమయ్యెను. అందుచే

దివానును తీసికొనిరమ్మని ఇద్దరు మనుష్యులను కాగడాలతో దివాను బంగళాకు పంపెను. దివాను దర్బారులోనికి వెళ్ళుమార్గమున ఇద్దరు కట్టెలు అమ్ముకొనువాండ్రు గుడిసెబైట పరుండియుండిరి. దివానును కాగడాల వెలుతురులో గుర్తుపట్టి ఒకడు పలికెను. అదుగో దివాను గారు వెళ్ళుచున్నారు. వెంటనే ప్రక్కనుపరుండిన రెండవవాడు పలికెను. "ఈదివాను మూర్ఖుడు." నిశ్శబ్దముగానున్న రాత్రి యగుటచే ఆ మాటలు దివాను చెవిని పడెను. ఆయన తన మనుష్యుని ఆమాటలు పలికినవారి పేర్లు మొదలగు వివరములు తెలిసికొని రమ్మని పంపెను. అనంతరము రాజుగారివద్దకు వెళ్ళి ఆయనకు సలహా చెప్పి తనబంగళాకు తిరిగి వచ్చి నిద్రించెను. రెండవరోజున ఆకట్టెలవాండ్రను ఇద్దరిని పిలచుకురమ్మని నౌకరునకు ఆజ్ఞాపించెను. దివాను ఏమి శిక్ష విధించునో అని వారు భయపడిరి. వణకుచు వారు దివానువద్దకు వెళ్ళిరి. రెండవవానితో దివాను పలికెను "నిన్ను శిక్షించను. నీవు నన్ను మూర్ఖుడవని ఏల అంటివో తెలుపుము." వాడు పలికెను:— "బాబూ! నేను కట్టెలు అమ్ముకొని బ్రతుకుదును. ఉదయము 5 గంటలకు లేచి అడవిలోనికి వెళ్ళి కట్టెలమోపును తీసికొని వచ్చెదను. వానిని అమ్మి రోజుకు 5, 6 అణాలు సంపాదించుకొనెదను. మధ్యాహ్నము పదిగంటలతో నేను నాపనికి స్వస్తి చెప్పుదును. తరువాతనున్న సమయమంతయు విశ్రాంతి తీసికొనెదను. రాత్రి నాకు ఎవ్వడైన నూరురూపాయలు ఇచ్చెదననినను బయటకు వెళ్ళను. ఏలనన, రాత్రిసమయము అలసిన శరీరమునకు విశ్రాంతి నివ్వవలెను. తమరు రాత్రిసమయమున రాజుగారి సన్నిధికి వెళ్ళుచుండుట చూచిన నాకు తోచెను. తమరు రెండువేలరూపాయలు జీతము తీసికొనెదరు. ఇంత గొప్పవారు అయినను ఇదేమి బానిసత్వము! రాత్రికూడ విశ్రాంతి లేదే. ఈ ఆలోచనలతోపాటు నానోటినుండి "మూర్ఖుడు" అను

మాట వచ్చెను. నన్ను క్షమించుడు.'' దివానుగారు పలికిరి:— "నీమాటలు నిజము. నీవు నాకు గురువువు.'' అట్లు పలికి వెంటనే ఆయన రాజునకు తన రాజీనామా వ్రాసి పంపెను. రాజు తనంతట తానే వచ్చి నచ్చజెప్పెను. కాని దివాను తన నిశ్చయమునందు స్థిరముగా నుండెను. "ఇంక బానిసత్వము చేయలేను.'' అనెను. ఈవిధముగా దివాను రాజీనామా నిచ్చెను.

ఒక విద్వాంసుడు పలికెను.

*సేవయా ధనమిచ్ఛద్భిః సేవకైః పశ్య యత్కృతమ్ ।*
*స్వాతన్త్ర్యం యచ్ఛరీరస్య మూఢైస్తదపి హారితమ్ ॥*

"సేవచేసి ధనమును కోరు సేవకుల బ్రతుకు చూడండి. సేవకులకు శరీరస్వాతంత్ర్యము అయినను లేదు.''

ప్రేమజీ :— నేను రాజ్యములో ఇంతకాలమువరకు ఉద్యోగము చేసెదనని నిర్ణయము చేసికొంటిని. ఇప్పుడు ఎట్లు విడవగలను? సమయము పూర్తి అయినతరువాత క్రొత్త ఉపాధిని పెంచుకొనను.

స్వా. వి. :— విడిపించుకొనుట ఏమిటి? వేరొక పెద్దరాజ్యమేది అయిన ఎక్కువ జీతము ఇచ్చి అధికారము చలాయించనిచ్చినచో అక్కడికి వెళ్ళెదరు. ఇది ముసలమ్మకథవలె ఉన్నది. పూర్వము ముసలమ్మ ఒకఆమె కలదు. ఆమెకు చిన్నతనమునుండియు గోబిలు అనిన చాలసరదా. ప్రతినవరాత్రియందును ఎన్నియోమార్లు గోబిలు పాడించెడిది. పెద్దది అయి కొడుకులు, కోడండ్రు ఇంటికి వచ్చినతరువాతకూడ ఆమెకు గోబిలునందు ప్రేమ తగ్గలేదు. పెద్దదయి విధవగా జీవితము గడుపుచున్నను గోబిలువిని వారితో కలసి తానుకూడ పాడుచుండెడిది. ఒకమారు నవరాత్రికి ఆమె తనకుమారునితో గోబిలు చూచుటకు వెళ్ళెదనని చెప్పెను. కుమారుడు "అమ్మా, నీవు గోబిలు చూచుటకు వెళ్ళరాదు. ఈవయస్సు గోబిలు చూడతగినది

కాదు. వినుచు వినుచు నీవుకూడ వారితో కలసి పాడుటకు మొదలు పెట్టిన మాగౌరవము పోవును. అందరును నవ్వుదురు." ముసలమ్మ పలికెను. "నేను శాంతముగా కూర్చొని గోబిలు చూచెదను. నేను ఏమియు చేయను. మాట్లాడనుకూడను. నేను కోడలుతోకూడ వెళ్ళెదను." ఇట్లు చెప్పి ఆమె కోడలుతో గోబిలుచూచుటకు వెళ్ళెను. కొంచెముసేపు గోబిలు వినుటతో ఆమె తన్మయురాలయ్యెను. ముసలమ్మ శ్రుతికలిపి పాడుచు నాట్యము చేయసాగెను. కోడలు చేయి పట్టుకొని లాగినను వెనుకకు రాలేదు. "ఉండలేకపోవుచున్నాను"అని అంతకంతకు ముసలమ్మ ఆగోబిలు పాడువారితో శ్రుతికలిపెను.

ప్రేమజీభాయికూడ ఆముసలమ్మవంటివాడే. మీరుకూడ శ్రుతికలిపి నాట్యముచేయుదురు. మిమ్ములను నమ్మువారు ఎవరు?

స్వా. ని. :— తమరు అనుచున్నారు కనుక ప్రేమజీభాయి నవ్వుచున్నారు. లేనిచో వారిస్వభావము చాలకఠోరమైనది. ఎవరును వారి ఎదుటకు రాలేరు.

స్వా. ప్ర. :— నాకేమి భయము. నేను నిజము చెప్పుచున్నాను. నాకు ఆయన ఇచ్చిన భూములు ఏమైన తీసికొనెదరా?

ప్రేమజీ :— స్వామివారికి నాయందు దయ. అందుచే వారు నాహితమును కోరి చెప్పెదరు.

స్వా. ప్ర. :— బొంబాయిలో మోతీలాల్ దలపత్ రామ్ అను నాస్నేహితుడగు సొలిసిటరు ఒకడుండెను. ఆయన సదాచారియు నిష్ఠాగరిష్ఠుడును. ఆయనకు తనవృత్తినుండి తప్పుకొనవలె ననుకోరిక తన 46వ సంవత్సరమున కలిగెను. అది విని ఆయన భార్య, పుత్రుడు చాల కోపించిరి. నాకు తెలిసి నేను వారికి "ఇంకను కొంచెము కాలము గడుపుట మంచిది" అని ఉత్తరము వ్రాసితిని. ఆయన ఉత్త

రమునకు జవాబు ఇవ్వలేదు. కాని నేను బొంబాయి వెళ్లినప్పుడు ఇట్లు చెప్పెను. "ఉత్తరమునకు "కాదు" అని సమాధానము వ్రాసినచో తనమాటను తిరస్కరించినట్లగును. కాని నామనస్సు నివృత్తి చెందుటకు దృఢముగా నిశ్చయించుకొనినది." అంతట నేను వారిని "మీజీవితము గడపుకొనుటకు సాధనములు కలవా" అని అడిగితిని. ఆయన సమాధానము చెప్పెను. "బ్రతుకుటకు ఉన్నది. విలాసమునకు లేదు. జీవితమంతయు ఎట్లు వ్యర్థము చేయుదును? నాశ్రేయము కొరకు ప్రయత్నించవలదా!" ఈమాటలు విని నేను ఊరకొంటిని. అనంతరమున 'ఊరణ'లోని ఒకతోటలో చిన్న ఆశ్రమమువంటి ఇంటిలో ఉండెడివాడు. నిరంతరము ధ్యానపరాయణుడయి పరమార్థ చింతనమునందు కాలక్షేపము చేసెడివాడు.

ప్రపంచమున అట్టి జనులు లేరని కాదు. తక్కువగా నుందురు. స్వామి శ్రీనిత్యానందులవారు ఇదివిని ఎంతయో సంతసించిరి. "మరల కలియుట ఎప్పుడు" అని అడిగిరి. శ్రీస్వామిప్రకాశానందులవారు సమాధానము చెప్పిరి. కొద్దిరోజులతరువాత తప్పక వచ్చెదను. అనంతరము స్వామి శ్రీనిత్యానందులవారు పీఠడియా వెళ్ళుటకు నిశ్చయించిరి. శ్రీప్రకాశానందులవారిని విడచివెళ్ళుట అనిన శ్రీనిత్యానందులవారికి ఎట్లుండునో వారి ముఖముద్రనుండి వెల్లడి అగుచుండెను. వారి హృదయము ఎంతయో దుఃఖించుచుండెను.

వైద్య :— తమ వియోగమనిన స్వామివారికి ఎంతయో కష్టము. స్వామివారి హృదయము చాలకోమలమయినది.

## మహాత్ముల హృదయము.

స్వా. ప్ర. :— స్వామివారి హృదయము కోమలమయినదే. అంతియే కాదు. కఠోరమయినదికూడను. మహాత్ముల హృదయములు అట్లే ఉండును. చాకలిరేయొక్క నిందావాక్యములను వినిన

తోడనే శ్రీరామచంద్రుడు సీతను అడవిలోనికి పంపెను. అంతట జనులకు సీతను మరల రాజ్యములోనికి తీసికొనివచ్చుట యుక్తమని తోచెను. వారు రాముని అశ్వమేధయాగము చేయుమని ప్రార్థించిరి. భార్యలేనిదే ఆయజ్ఞము చేయబడదు. యజ్ఞముచేయుటకు నిశ్చయించినచో సీతను పిలిపించనైన పిలిపించవలెను, లేదా మరియొక వివాహమైనను చేసికొనవలెను. రామచంద్రుడు యజ్ఞము చేయుటకు అంగీకరించెను.

ఈసంగతి వాల్మీకిమహర్షికి తెలిసెను. "రాముడు అశ్వమేధము చేయును. అందుకు మరియొక వివాహము చేసికొనును. ఇది చాల దుఃఖించవలసిన సంగతి" అని ఆయన సీతతో చెప్పెను. కాని ఆమె నమ్మలేదు. "నా అంతరాత్మ విశ్వసించుట లేదు. ఆయన చేసికొనరు" అనెను. అశ్వమేధమును ఆరంభించుతరుణమున వశిష్ఠుడు చెప్పెను. "సీతనైన పిలిపింపుము, లేదా మరియొక వివాహమునైన చేసికొనుము. లేనిచో యజ్ఞముచేయుటకు వీలుపడదు." రాముడు పలికెను. "రెండవ పెండ్లి చేసికొనినచో ఏకపత్నీవ్రతమునకు భంగము కలుగును. సీతను పిలువనంపినచో జనులు నవ్వెదరు. స్వర్ణసీతను చేయించి యజ్ఞమును చేసెదను." ఈమాటలు వాల్మీకికి తెలిసి సీతతో పలికెను. "ఎంతయో సంతోషము. రాముడు రెండవ పెండ్లి చేసికొనుట లేదు. స్వర్ణసీతతో యజ్ఞముచేయుటకు నిశ్చయించుకొనెను." ఈవిషయమున చెప్పబడినది.

*వజ్రాదపి కఠోరాణి మృదూని కుసుమాదపి ।*
*లోకోత్తరాణాం చేతాంసి కో ను విజ్ఞాతుమర్హతి ॥*

"ఉత్తమచిత్తముకల మహాత్ముల హృదయములు వజ్రముకంటె కఠినముగా నుండును. పుష్పముకంటె కోమలముగా నుండును. వానిని తెలిసికొన సమర్థుడు ఎవడు?"

చాకలిమాటలు విని సీతను విడచివేయు కాఠిన్యమును ఆహృదయము పొందియుండెను. రెండవపెండ్లి చేసికొనినచో సీత దుఃఖించునను భావముతో స్వర్ణసీతను చేయించి సీతను బాధించలేదు. ఆయన హృదయము అంత కోమలమయినది. ఇట్లే స్వామివారి హృదయము దీనులను చూచి కరగిపోవును. కాని వైరాగ్యమును పాలించుటలో ఎంత కఠోరమో చెప్పలేము. అటుతరువాత శ్రీనిత్యానందులు మొదలగువారు పీఠడియా బయలుదేరిరి.